# పుత్రస్య గతిర్నాస్తి

నాసమల్లి సత్యనారాయణ

ఆరోజున ఆంజనేయులు ఆఫీసు నుంచి ఇంటికి చాలా ఆలశ్యంగా వచ్చాడు. అతను వచ్చేసరికి రాత్రి ఎనిమిది గంటలైంది. దానికి కారణం ఆరోజు 31వ తేదీ. జీతాలిచ్చే రోజు. అతను పే డ్యూటీలో ఉన్నాడు. అందులో ఆరోజు అతని సైకిలు కూడా ట్రబుల్ ఇచ్చింది.

అతను ఓ ప్రైవేట్ కంపెనీలో చిరు ఉద్యోగనే చెప్పాలి. అన్ని కటింగులు పోనూ వచ్చే ఆరువందల తోనే, మరే ఇతర ఆదాయం లేని అతడు తన కుటుంబాన్ని పోషించుకోవాలి. తను, భార్య, ముగ్గురు పిల్లలు అందరికీ ఆ ఆరువందలే ఆధారం.

ఐదు రూపాయిలతో పావుకిలో మిఠాయి తెచ్చాడు. తన పాకెట్ మనీకి ఇరవైఐదు రూపాయిలు వుంచుకొని మిగతా డబ్బును భార్య కందించి మిఠాయిలను పిల్లలకు పంచమని చెప్పాడు. మాలతి పెద్దది. ఐదో తరగతి చదువుతోంది. పెద్ద కుర్రాడు రవి మూడో తరగతి. ఆఖరివాడు వెంకన్నబాబు— మూడు సంవత్సరాల వాడు. పెంకివాడు. గడుగ్గాయి. ఏడుపు, మంకుపట్టు, అల్లరి, తిండి వాడికి తెలిసిన విద్యలు. తల్లి చేతిలోని మిఠాయి పొట్లం లాక్కుని ఒక్కడే తింటూ అక్కకు అన్నకు ఎవరికీ పెట్టనని వాళ్లను ఉడికిస్తున్నాడు.

మాలతి, రవి చాలా సాత్వికులు. అల్లరి చెయ్యరు. "నాకొకటి ఇవ్వవూ, నిన్నెత్తుకుని ఆడిస్తాం" అని వాళ్లిద్దరూ ఆశగా చేతులు చాపారు. కాని ఆ ఆఖరివాడు వచ్చీరాని మాటలతో "నేనివ్వను అన్నీ నాకే" అంటూ పారిపోయాడు.

ఆంజనేయులుకు స్నానానికి నీళ్లు పెట్టి లోపలికి వచ్చి వెంకన్నబాబును బుజ్జగించి రెండు లడ్డులు తీసి పెద్ద పిల్లలు ఇద్దరికీ ఇచ్చింది తల్లి లక్ష్మి. కాని వాడు ఏడుస్తూ పొట్లాన్ని దూరంగా విసిరేసి అలిగి కోపంతో నేలమీద పొర్లి పొర్లి రాగాలు తీస్తున్నాడు.

"అమ్మ వెధవల్లారా తమ్ముడి లడ్డులు తినేస్తున్నారా? అన్నీ తమ్ముడికే. మీరిద్దరు బయటికి పొండి!" అని మాలతిని, రవిని అవతలకు పొమ్మన్నట్లు సౌంజ్ఞ చేసింది. కింద పడ్డ లడ్లన్నీ ఓపికగా ఎత్తి పళ్లెంలో ఏరిపెట్టి ఆ చిన్నాడిముందుంచింది ఆ తల్లి.

"ఇంకా కావాలి" ఏడుస్తూనే వున్నాడు వాడు.

జీతాలరోజు ఏ బడుగు ఉద్యోగికైనా మతి మతిలో వుండదు. ఆ చిరాకులో ఉన్న ఆంజనేయులుకు ఆ ఏడుపు, ఆ గొడవ, అల్లరి వినబడడంతో చిర్రెత్తి పోయింది. తొందర తొందరగా రెండు చెంబులు ఒంటిమీద దిమ్మరించుకుని, లుంగీ చుట్టుకుని బాత్‌రూం నుంచి పరుగుపరుగున వచ్చి "అసలు నీకు బుద్ధి వుందా? ఈ ఎక్స్‌ట్రాగాడికి ఆ పొట్లం ఎందుకు చూపించావ్. ముందు వీడిని తీసుకుని బయటకు వెళ్లు. తలనెప్పి వస్తోంది" కోపంగా అరిచాడు.

"అమ్మో! నాన్నగారు చంపేస్తార్రా! తినునాన్నా. అన్నీ నువ్వే తిను. ఏడవకు. అల్లరిచెయ్యొద్దు" మళ్లీ స్వీట్లు అన్నీ ఏరి పళ్లెంలో పెట్టి ఆ చిన్నాడిముందు వుంచింది తల్లి.

"అన్ని లడ్డులూ నాకే కావాలి" అంటూ ఆ పళ్లాన్ని ఒక్క తన్ను తన్నాడు గారం గునుస్తూనే.

ఇక వాడి ఏడుపు గొడవ పట్టించుకోకుండానే వదిలేసి, భర్తకు అన్నం వడ్డించింది లక్ష్మి.

చిరాకుగానే ఆంజనేయులు భోజనం చేయసాగాడు. అతని ప్రక్కనే నిలబడింది లక్ష్మి.

"జాగ్రత్తగా అన్నీ లెక్కలు చూసి జీతం సర్దు. సాయంత్రం పాలు రెండు పావులే తీసుకో చాలు. కూరగాయల రేట్లన్నీ పెరిగిపోయాయి. ఇంటి అద్దె పెంచేశారు. డబ్బులు ఆలోచించి ఖర్చు పెట్టాలి" తింటూనే హెచ్చరిస్తున్నాడు భార్యను ఆంజనేయులు.

"చిన్నవాడు పాలు తాగకపోతే అల్లరి చేస్తాడండీ. ఆ ఖర్చు తగ్గించడానికి వీలులేదు. పోనీ కూరగాయలన్నా తగ్గించుకుందాం" అన్నది లక్ష్మి.

"వాడు పాలు తాగకపోతే ఏమీ చావడు. పాలు తాగినా తాగకపోయినా వాడు అలా అల్లరి చేస్తూనే వుంటాడు. వాడి స్వభావమే అంత. చూడు వెధవకి అన్ని స్వీట్లు ఇచ్చినా నోరుమూశాడేమో! అసలు తిరుపతిలో వాంతులు చేసుకున్నప్పుడే చెప్పాను అబార్షన్ చేయిస్తానని. నీదో వెధవ సెంటిమెంటు. దాని ఫలితం నేననుభవిస్తున్నాను. ఇప్పుడు ఈ ఎక్స్‌ట్రాగాడిని భరించలేక చస్తున్నాను!" ఇద్దరితో సరిపెట్టుకొని ఆపరేషన్ చేయించుకొందామనుకొన్నఆంజనేయులును వారించింది. అబార్షన్ చేయిస్తానంటే అందుకూ ఒప్పుకోలేదు లక్ష్మి. అందుకే ఆనాటి నుంచి అతనికి భార్యంటే కోపం. ఆ చిన్నాడంటే చెప్పలేనంత కసి. తన కుటుంబ ఆర్థిక వ్యవస్థను తారుమారుచేసి కుదిపి వేసే సమస్యగా ఆ మూడో సంతానమైన చిన్నాడు అగుపిస్తాడు అతనికి. అందుకే అతను అలా వంటికాలు మీద లేచాడు.

"అబ్బబ్బ! చిన్నాడి పేరు చెపితే ఎందుకలా మండి పడతారు. ఎక్స్‌ట్రాగాడు అని వాడిమీద పడిఏడుస్తారు! తప్పంతా వాడే అన్నట్లు మాట్లాడతారేం?"

"బుద్ధి తక్కువై!"

"అసలు మీకు దేవుడు పిల్లల్ని ఇవ్వకుండ గొడ్డు బోతువాడిని చెయ్యవలసింది."

"ఆ... పెళ్ళికి ముందే నేను ఆపరేషన్ చేయించు కుంటే గొడ్డుబోతువాడిని అయివుండే వాడిని నువ్వు అన్నట్లే. ఈ ఆర్థిక సమస్యలు బాధలు వుండేవి కావు. సరేలే. వెధవ సొద మాని ముందు ఆ ఎక్స్‌ట్రాగాడిని అవతలికి తీసికెళ్ళు" విసుగ్గా అన్నాడు.

"ఎక్స్‌ట్రాగాడు, ఎక్స్‌ట్రాగాడు. ఏమంత పది మంది పిల్లలని... వాడు ఎక్స్‌ట్రాగాడయ్యాడు మీకు. మీ కన్నకొడుకే మీకు ఎక్స్‌ట్రాగాడైపోయాడా?" లక్ష్మి సణుక్కుంటూ వెళ్ళి వాణ్ణి ఎత్తుకొని బుజ్జగించసాగింది. అప్పటికే ఆ లడ్లన్నీ చిందరవందర చేసి కొంత తిని కొంత పాడుచేసి ఇంకా కావాలని పెంకిగా ఏడుస్తున్నాడు వాడు. లక్ష్మి ఎంత చెప్పినా వినడం లేదు.

అన్నం తింటున్న ఆంజనేయులు చిరాకుతో లేచి మేకుకు తగిలించి వున్న బెల్టు తీసి కోపంతో రెండు అంటించాడు ఆ చిన్నాడిని. అందులో ఒక దెబ్బ లక్ష్మి చేతికి తగిలి, గాజులు ముక్కలయ్యాయి. రాగం ఉధృతం చేశాడు వాడు. వాడిని తీసుకుని భయంతో బయటకు వెళ్లిపోయింది లక్ష్మి.

ఆంజనేయులు భోజనం మధ్యలోనే చేయి కడు క్కుని, బుసలు కొడుతూ కుర్చీలోనికి వచ్చి కూర్చు న్నాడు. తండ్రి ఆగ్రహాన్ని గ్రహించిన మాలతి, రవిలు ఒక్కదుటున దుప్పట్లో దూరి కళ్ళు గట్టిగా మూసు కున్నారు.

చాలా సేపటివరకూ చిన్నాడు గుక్క పట్టి ఏడ్చి ఏడ్చి పడుకున్నాడు. రాత్రి తొమ్మిదిన్నరయింది. లక్ష్మి తిరిగి ఇంట్లోకి వచ్చి భోజనం చేయకుండానే వాడిని పక్కలో వేసుకుని పడుకుంది. ఆమె చేయి, చిన్నాడి పిర్రలు బెల్టు దెబ్బలకు వాచిపోయాయి.

మాలతి, రవి నిద్ర పోయారు. ఆంజనేయులు చాలాసేపునిద్రపోకుండా ఆలోచిస్తూనేవుండిపోయాడు.

* * * *

అలారం మ్రోగింది.

తెల్లవారింది.

లక్ష్మి, చిన్నాడు లేవలేదు.

వాళ్ళ ఇరువురి శరీరాలు జ్వరంతో కాలిపోతున్నాయి. బద్ధకంగా పడుకునే వున్నారు.

ఆంజనేయులు లేచి, మాలతి-రవి లిరువుర్నీ లేపాడు. కాల కృత్యాలు తీర్చుకోమని చెప్పి పంపు దగ్గరకు వెళ్లి లక్ష్మి డ్యూటీ తానే చేశాడు. నీళ్లు పట్టి తెచ్చాడు. మిల్క్ బూత్‌కు వెళ్లి పాల పాకెట్ తెచ్చాడు. తనూ కాలకృత్యాలు తీర్చుకుని స్నానంచేసి పెద్ద

పిల్లలిద్దరికీ స్నానాలు చేయించాడు. వాళ్ళు యూనిఫాంలు వేసుకుని స్కూలుకు తయారయ్యారు. ఈలోగా ఉప్మా తయారుచేశాడు. తను కొంత తిని, ఆ ఇద్దరికీ పెట్టి "లంచ్‌కి మధ్యాహ్నం వచ్చేయండి" అని చెప్పి వాళ్లను పంపించి, కొంచెం ఉప్మా టిఫిన్ బాక్స్‌లో పెట్టుకుని ఆఫీసుకు టైం అవుతుంటే బట్టలు వేసు కున్నాడు. అప్పటికి లక్ష్మి లేచింది.

"ఊ... ఇప్పుడే తెల్లవారింది కదూ? ఏం— వళ్ళు ఎలా వుంది?" తీవ్రంగా ప్రశ్నించాడు ఆంజనేయులు.

"మీ దయవల్ల వళ్లంతా వాయలేదు" అంటూ చేయి చూపింది. ఆమె ముంజేయి ఎర్రగా కంది వాచి వుంది. దాన్ని చూడగానే ఆంజనేయులుకు జాలి కలిగింది. కాని అభిమానం అడ్డు వచ్చింది. ఇంటి ఆడదాన్ని ఎంతలో వుంచాలో ఆమెతో ఎలా ప్రవర్తించాలో మూడో సంతానం కలిగాక అతను కొన్ని సిద్ధాంతాలు పెట్టు కున్నాడు.

"ఊ... నిన్ను కొట్టాలని కొట్టలేదు."

చిన్నాడికి దెబ్బ తగిలిన చోట చేత్తో రాస్తూ ఉంది లక్ష్మి.

మళ్లీ ఆంజనేయులే—

"వీడికి మూడేళ్లు లేవు. ఆవకాయ జాడీలు, గాజు గ్లాసులు, చెంబులు, గిన్నెలు అన్నీ బద్దలుకొడ్తాడు. స్టాండు వేసిన సైకిలు నెత్తిమీద పారేసుకుంటాడు. పిల్లల పుస్తకాలు చింపేస్తాడు. అసలు వాడే నాకో అదనపు ఖర్చు. పైగా వస్తువులిలా తగలేస్తూ అనవసరపు ఖర్చు తగిలిస్తూంటే నేనెలా చచ్చేది" అన్నాడు విసుగ్గా.

"అందుకని సరిగా మాటలు కూడా రాని ఆ పసివాడిని గొడ్డును బాదినట్టు బెల్టుతో చావగొడ్తారా"?

"అబ్బా! లక్ష్మీ ఏమిటేవాడిమీద నీకింతమమకారం, నాకు మాత్రం కన్నకొడుకునుకొట్టుకోవాలనిపిస్తుందా? వాడు అల్లరి వెధవ, దుర్మార్గుడు, పెంకి ఘటం. వాడిని భయపెట్టడానికి దండించాను".

"అబద్ధం, వాడంటే మీకు అసహ్యం... పోనీ ఎవరికైనా ఇచ్చెయ్యకూడదూ, పెంపకానికి".

"ఓ! ఎవరైనా పెంచుకుంటానని అడగాలే గాని వెంటనే ఇచ్చేస్తాను. నా ఖర్చు తప్పుతుంది".

"కన్న కొడుకుని పెంచడానికే ఖర్చు అయిపోతుందని మీరు బాధపడ్తున్నారే, ఎవరో కన్న బిడ్డను మరెవరో పెంచుకునేవారు ఇంకెంత బాధ పడాలి".

"కావాలని తీసుకెళ్లి పెంచుకోవాలనుకొనేవారు బాధపడరు. ఖర్చు గురించి ఆలోచించరు. వాళ్లకు ఎక్స్‌ట్రాగాడుగా లెక్కల్లోకి రాడు వాడు".

"అన్నిటినీ లెక్కలతోను, ఖర్చులతోను, డబ్బుతోను గణితాలు కట్టే మీవంటి తండ్రులుంటే ఈ సమాజం గొడ్డుమోతుది అయి వుండేదేమో!"

సంతానం కలిగాక చింతించడం కంటె ముందు జాగ్రత్త మేలుకదా! క్షణికావందంలో యివన్నీ గుర్తురావు.

ఇంకా పడక గదిలో కూడా దేశభక్తి, సామాజిక పరిస్థితులు జ్ఞాపకం రావాలా? మీలాంటి పాషాణ పాక ప్రభువులాటి తండ్రి వుండడు ఈ లోకంలో.

"అని సువ్వనుకుంటున్నావ్. నాలాంటి ఆర్థికస్తోమత లేని ప్రతి తండ్రి పడే బాధ, అతడు పడే ఆవేదన కూడ




ఇంతకు ఏమీ తీసిపోదు. అయితే నాలా వాళ్ళు పైకి చెప్పలేరు. అంతే తేడా! ఆఫీసుకు టైం అవుతూంది వస్తా" అంటూ ఆంజనేయులు పైకిలెక్కి వెళ్లిపోయాడు.

తక్కువ మంది పిల్లలుండడం మంచిదే కాని పుట్టాక ఏ ఒక్కరినో ఎక్స్‌ట్రాగాడనుకుని డించుకోవడం అమానుషం కాదా? ఆర్థిక కారణాలు మానవత్వపు విలువలను తినేస్తే ఎట్లా? ఆమె శూన్యంలోకి చూస్తూండిపోయింది.